
## సోలార్ కంచె ఏర్పాటు




బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన సోలార్ కంచె, ప్లేటు

బాసర, సెప్టెంబర్ 9 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో సోమవారం చుట్టూ సోలార్ కంచెను ఏర్పాటు చేశామని ఆలయాధికారులు తెలిపారు. ఇటీవల దొంగలు ఆలయంలోకి చొరబడ్డారు. ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా భద్రతా చర్యలు చేపడుతున్నామని, పోలీసులు భద్రతా ఏర్పాట్లును పరిశీలస్తున్నారని తెలిపారు. హోంగార్డ్స్‌ను అప్రమత్తం చేస్తూ అలర్ట్‌గా ఉండాలని పోలీసులు సూచించారు.

## మమ్మల్ని గుర్తించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే..



మాట్లాడుతున్న ఓడ్ కులస్తుల సంఘం ప్రధాన కార్యదర్శి శంకర్

ఎదులాపురం, సెప్టెంబర్ 9 : ఏండ్లుగా సంచార జాతిగా ఉన్న తమను బీఆర్ఎస్ ప్రభుత్వమే గుర్తించిందని, కానీ.. గుర్తించిన తమను కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోవద్దని ఓడ్ సంఘం ప్రధాన కార్యదర్శి శంకర్ కోరారు. గుర్తింపు వచ్చిన నాలుగేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం బీసీ సంక్షేమ భవనంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తమను ప్రభుత్వాలు గుర్తించినందుకు ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, ఓడ్ సంఘం అధ్యక్షుడు చవాన్ ప్రకాశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మోహితే, మారుతి, భీంరావు, చవాన్ గణేశ్, జాదవ్ అజయ్ పాల్గొన్నారు.

## విద్యార్థులతో వీసీ చర్చలు

బాసర, సెప్టెంబర్ 9 : ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ సోమవారం సమీక్ష నిర్వహించాడు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అసోసియేట్ డీన్, చీఫ్ వా ర్డెన్ అధికారులతోపాటు కలిసి విద్యార్థులతో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, విద్యార్థులు క్యాంపస్‌లో శాంతి, సామరస్యాన్ని కాపాడేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అంగీకరాన్ని తెలిపి, ట్రిపుల్ ఐటీలో మరిన్ని కమిటీలను ఏర్పాటు చేసి యూనివర్సిటీ పనితీరును సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా వీసీకి విద్యార్థులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.



వీసీతో సమావేశమైన విద్యార్థులు

## ఎస్‌డీపీ మిషన్ ప్రారంభం

ఎదులాపురం, సెప్టెంబర్ 9 : రిమ్స్‌లో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్(ఎస్‌డీపీ) మిషన్‌ను సోమవారం డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ప్రారంభించారు. నేషనల్ హెల్త్ మిషన్, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ యంత్రం మంజూరు అయిందని, డెంగ్యూ, మలేరియా బాధితులకు చికిత్స అందించవచ్చన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ యంత్రం ద్వారా వైద్యం అందిస్తే రూ.12 వేల వరకు చెల్లించాల్సి వస్తుందన్నారు. రిమ్స్‌లో ఉచితంగా సేవలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ పాథాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధాకర్, బ్లడ్ బ్యాంక్ వైద్యులు రాజ్యలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.



రిమ్స్‌లో ఎస్‌డీపీ యంత్రాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ జైసింగ్ రాథోడ్



ప్రజావాణికి వచ్చిన దరఖాస్తుదారులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి

# అయ్యా.. పరిష్కరించండి

● ప్రజావాణికి పోటెత్తిన వినతులు ● రుణమాఫీ, ఇతర సమస్యలపై 92 దరఖాస్తులు ● కలెక్టర్ రాకపోవడంతో హాజరుకాని పలు శాఖల అధికారులు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 9(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి దరఖాస్తుదారులు తరలివచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ అధికారులను విన్నవించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలాదేవి వినతులు స్వీకరించి అధికారులకు సూచనలు చేశారు. రుణమాఫీ, భూ సమస్యలు, ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అద్దె గదుల కేటాయింపు, ఇతర సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ సెలవులో ఉండడంతో దరఖాస్తులు స్వీకరించడానికి పలు శాఖలకు చెందిన అధికారులు హాజరుకాలేదు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ప్రజావాణి మధ్యాహ్నం 1.30 గంటలకు ముగిసింది.

### రుణమాఫీ విషయంలో స్పందన లేదు



*నా పేరిట 3.28 ఎకరాలు, నా కొడుకు సురేశ్ పేరిట 2.15 ఎకరాల భూమి ఉంది. నేను రూ.2 లక్షలు, కొడుకు రూ.1.90 లక్షల బ్యాంకులో రుణం తీసుకున్నా. మా ఇద్దరిలో ఒక్కరికి కూడా రుణమాఫీ కాలేదు. కుటుంబ సభ్యులందరికీ కలిసి ఒకే రేషన్ కార్డు ఉండడంతో మా లోన్ రూ.3.90 లక్షలుగా చూపెడుతున్నారు. ఇద్దరికీ వేర్వేరు పట్టాలు ఉన్నాయి. ప్రభుత్వం రైతులకు పట్టా పాసుపుస్తకాల ఆధారంగా కాకుండా రేషన్‌కార్డును పరిగణలోకి తీసుకుని రుణమాఫీ చేసింది. మాకు రుణమాఫీ ఎందుకు జరగలేదని బ్యాంకు అధికారులను అడిగితే మీ వివరాలను పంపించాం. మాకు తెలియదు అని అంటున్నారు. రెవెన్యూ అధికారులను అడిగితే స్పందన లేదు. రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటామని ప్రభుత్వం చెప్పింది. నేను దరఖాస్తు ఇవ్వడానికి తలమడుగు మండలంలోని సుంకిడి రైతువేదికకు వెళ్తే రేషన్‌కార్డు విషయం కాకుండా వేరే సమస్యలు ఉంటే చెప్పండి. మీ దరఖాస్తు తీసుకోమని చెప్పారు. లోన్ కోసం 20 రోజుల నుంచి తిరుగుతున్నా స్పందన లేదు. రూ.2 లక్షల లోన్ రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి. మాకు రుణమాఫీ చేయాలని కలెక్టర్‌ను కలిసి దరఖాస్తు ఇవ్వడానికి వచ్చా.*

**- పెద్ద నర్సింహులు, రైతు, ఖోడద్, తలమడుగు మండలం**



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

## ఫిర్యాదులను పరిష్కరించాలి

**నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 9 : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి విద్య, వైద్యం, రుణమాఫీ, వరద నష్టం, రెవెన్యూ, ధరణి సమస్యలపై ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఆర్‌వో భుజంగ్ రావు, ఆర్డీవో రత్నకల్యాణి పాల్గొన్నారు.

### దిక్కులేని వారమయ్యాం..

*గత నెల 27వ తేదీన ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరిలో చేపల వేటకు వెళ్లిన తన కుమారులు నాగుల్ వాడే విజయ్( 28), నాగుల్ వాడే ఆకాశ్(26), నాగుల్ వాడే అక్షయ్( 24) ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మరణించారని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని తాంసి మండలంలోని బండల్ నాగాపూర్‌లో నివాసం ఉంటున్న మీనా నాగుల్‌వాడ్ తన ఇద్దరు కోడళ్లతో కలిసి ప్రజావాణిలో వినతిపత్రం అందజేసింది. కుటుంబాలను పోషించాల్సిన కుమారులు వాగులో పడి చనిపోవడంతో తాను, తన భర్త, ముగ్గురు కోడళ్లు దిక్కులేని వారమయ్యామని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం తాము కప్పర్ల గ్రామంలో తమ్ముని వద్ద ఉంటున్నామని, కొడళ్లకు ఒంటరి మహిళా పింఛన్ ఇప్పించాలని, ఆర్థిక సాయం అందించాలని కోరారు.*

**- అత్తాకోడళ్ల ఆవేదన**



# బాబోయ్.. జ్వరాలు

**చుక్కలు చూపిస్తున్న వైరల్ ఫీవర్స్**

● ప్రతి ఇంట్లో జ్వర పీడితులే.. ● జ్వరానికి తోడు కీళ్ల నొప్పులు ● కిటకిటలాడుతున్న దవాఖానలు



నిర్మల్‌లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఓపీ చిట్టీల కోసం బారులుదీరిన జ్వర పీడితులు

నిర్మల్, సెప్టెంబర్ 9(నమస్తే తెలంగాణ) : నెల రోజులుగా జ్వరాలు జనాన్ని పట్టి పీడిస్తున్నాయి. పట్టణ ప్రాంతాలతోపాటు పల్లెల్లోనూ వైరల్ ఫీవర్స్ వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. గతానికి భిన్నంగా ఈసారి జ్వర లక్షణాలు ఉంటుండడం ఆందోళన కలిగిస్తున్నది. చికున్ గున్యా, డెంగ్యూ, టైఫాయిడ్ లక్షణాలతో జ్వరాలు జనాన్ని కోలుకోకుండా చేస్తున్నాయి. చికున్ గున్యా లక్షణాలైన కీళ్లు, ఒంటి నొప్పులతోపాటు డెంగ్యూ లక్షణాలైన ప్లేట్ లెట్స్ తగ్గిపోవడం, ఒంటిపై దద్దుర్లు, వాపులు రావడం వంటివి ఒకేసారి జ్వర పీడితులను చుట్టుముడుతున్నాయి. దీనికి తోడుగా బీపీ తగ్గిపోవడం, కళ్లు తిప్పి పడిపోవడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ జ్వరాలకు గురైన వారు 90 శాతం మంది కీళ్లు, ఒళ్ల నొప్పులతో నడవలేని స్థితుల్లోనే ఆసుపత్రులకు వస్తున్నారు. జ్వరాలతో వచ్చే రోగులకు వైద్యులు చికున్ గున్యా, డెంగ్యూ నిర్ధారణ కోసం రక్త పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ ఆ పరీక్షల్లో వీరికి నెగెటివ్ రిపోర్ట్ వస్తుండడం వైద్యులకు అంతు పట్టడం లేదంటున్నారు. జ్వరంతో వచ్చే రోగులకు నిర్వహించే రక్త పరీక్షల్లో వైరల్ ఫీవర్ వంటి లక్షణాలు వెల్లడవుతున్నాయే తప్పా, చికున్‌గున్యా, డెంగ్యూ పాజిటివ్ లక్షణాల రిపోర్టులు రావడం లేదని చెబుతున్నారు. అయితే రోగి పరిస్థితిని చూస్తే మాత్రం ఈ రెండు లక్షణాలు భౌతికంగా కనిపిస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. సాధారణంగా ప్రతి వానకాలంలో వైరల్ ఫీవర్స్ ఉండడం సహజమే. అయినప్పటికీ ఈ ఫీవర్స్ కారణంగా చలి జ్వరం, సాధారణ ఒళ్లు నొప్పులు, నీరసం వంటివి రోగుల్లో కనిపిస్తాయి. దీనికి తోడు జలుబు, దగ్గు, తలనొప్పి వంటివి కూడా ఉంటాయి. అయితే ప్రస్తుతం మాత్రం జ్వర పీడితులలో విభిన్నమైన లక్షణాలు బయటపడుతున్నాయి. స్థానిక జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రెండు నెలలుగా దాదాపు మూడు వేల మందికి రక్త పరీక్షలు నిర్వహించగా.. వారిలో కేవలం 108 మందికి మాత్రమే డెంగ్యూ లక్షణాలు వెల్లడయ్యాయి. కానీ.. వారంతా డెంగ్యూ, చికున్ గున్యా లక్షణాలతోనే బాధపడుతున్నట్లు చెబుతున్నారు. ఇలాంటి లక్షణాలతో ప్రతి ఇంట్లో జ్వర పీడితులు ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

### జ్వరాలు తగ్గినా ఇబ్బందులు తప్పడం లేదు

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ కొత్త రకం జ్వరాలకు చికిత్సలు పొందుతున్న వారు కనీసం వారం రోజుల వరకు కూడా కోలుకోవడం లేదంటున్నారు. అయితే కోలుకున్న తర్వాత కూడా 20 రోజుల నుంచి 30 రోజుల వరకు కూడా వీరు రకరకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కీళ్లు, ఒళ్లు నొప్పులతోపాటు నీరసం, బీపీ తగ్గిపోవడం, కళ్లు తిప్పి పడిపోవడం లాంటి లక్షణాలతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి అవసరమైతే కొన్ని పరిస్థితుల్లో డాక్టర్లు స్టెరాయిడ్స్ ఇస్తూ ఉపశమనాన్ని కలిగిస్తున్నారు. నెల రోజుల నుంచి ఇక్కడి ప్రధాన ఆసుపత్రిలో రోజు 100 మందికి పైగా ఇన్ పేషెంట్లుగా చికిత్సలు పొందుతున్నారు. వీరిలో చాలా మంది వారం పది రోజులపాటు చికిత్సలు పొందినప్పటికీ కోలుకోవడం లేదు. నిర్మల్‌తోపాటు ఖానాపూర్, భైంసా ఏరియా ఆసుపత్రులు కూడా రోగులతో కిటకిటలాడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జ్వరాలతో బాధపడుతూ చికిత్సల కోసం వచ్చే వారు వందల సంఖ్యలో ఉంటున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉన్నదో అర్థమవుతున్నది. జ్వరాల నివారణకు యంత్రాంగం పకడ్బందీ కార్యాచరణతో కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో దోమలు వృద్ధి చెంది జ్వరాలకు కారణమవుతున్నాయంటున్నారు.



జ్వర పీడితులతో కిక్కిరిన దవాఖానలోని వార్డులు

### లక్షణాలు అవే.. కానీ.. రిపోర్ట్‌లో తేలడంలేదు

*ప్రస్తుతం వస్తున్న వైరల్ ఫీవర్స్ లక్షణాలు ఏ మాత్రం అంతుపట్టడం లేదు. తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న వారిలో చికున్ గున్యా, డెంగ్యూ లక్షణాలు భౌతికంగా కనిపిస్తున్నాయి. వారికి నిర్వహించే రక్త పరీక్షల్లో అది తేలడం లేదు. వీరికి ఎలీసా టెస్ట్ చేసినప్పటికీ రిపోర్స్ మాత్రం నెగెటివ్‌గా వస్తుండడం గందరగోళానికి కారణం అవుతున్నది. ప్రస్తుతం వస్తున్న జ్వరాలకు కారణం తెలియని వైరస్ అని చెప్పవచ్చు. చికున్ గున్యాకు కారణమయ్యే వైరస్ లాంటిదే ఈ వైరస్ అయి ఉండవచ్చు. ఈ జ్వరాలతో బాధపడేవారంతా ఎక్కువగా యాంటిబయాటిక్స్ వాడకుండా పారాసిటమాల్ ట్యాబ్లెట్లు వేసుకోవాలి. అలాగే ఎక్కువగా లిక్విడ్స్, పండ్ల రసాలు, ఓఆర్ఎస్ లాంటివి తీసుకోవాలి.*

**- డాక్టర్ ప్రశాంత్, ప్రభుత్వ ఆసుపత్రి జనరల్ ఫిజిషియన్, నిర్మల్.**

## కాళోజీ కృషి మరువలేనిది

**రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్**

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 9 : తెలంగాణ ఉద్యమంలో ప్రజాకవి కాళోజీ చేసిన కృషి మరువలేనిదని రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కాళోజీ నారాయణ రావు 110వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన రచనలు, సాహిత్యం ద్వారా తెలంగాణ ప్రజానీకానికి ఉద్యమ పాఠాలు నేర్పిన గొప్ప వ్యక్తి కాళోజీ అని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, ఆనాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. కాళోజీ జయంతిని ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, డీఏవో అంజీప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ రాం గోపాల్ పాల్గొన్నారు.



కాళోజి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

## తెలంగాణ యాసను పరిచయం చేసిన కాళోజీ

ఎదులాపురం, సెప్టెంబర్ 9 : తెలంగాణ యాసను పరిచయం చేసిన మహాకవి కాళోజీ నారాయణ అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాళోజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా శ్యామలాదేవి మాట్లాడుతూ.. స్వతంత్ర సమరయోధుడు, తెలంగాణ యాసను కించపరిచిన వారికి తన కవిత్వాల ద్వారా సమాధానం చెప్పిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. అలాగే పోలీసు ముఖ్య కార్యాలయంలో కూడా కాళోజీ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ అభిగ్యాన్ మలవీయ, బీసీ సంక్షేమ శాఖాధికారి రాజలింగు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, డీడబ్ల్యూవో బి.సబిత, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

## సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్, సెప్టెంబర్ 9 : గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా అన్నారు. సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో గిరిజన దర్బార్ సందర్భంగా ఆర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కాళోజీ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాళోజీ సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ గంగాధర్, అధికారులు దామోదర్, సందీప్, నాగభూషణం, వసంత్ రావు, ప్రవీణ్, లింగు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా

## వదంతులను నమ్మవద్దు

● గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

● ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, సెప్టెంబర్ 9 : పండుగ సమయంలో కొంత మంది కావాలని సోషల్ మీడియాలో పనికి రాని పోస్టులు పెడుతున్నారని, అలాంటి వాటిని నమ్మవద్దని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. సోమవారం టీఎన్జీవోస్ భవనంలో గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడంతోపాటు సంస్కృతిని సంప్రదాయాలు చాటేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హైదరాబాద్ తరువాత ఆదిలాబాద్‌లోనే గణేశ్ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,600 గణేశ్ మండపాలలో విగ్రహాలను ప్రతిష్ఠించారన్నారు. నిమజ్జనం రోజు ఇబ్బందులు కలుగకుండా పోలీసుశాఖ తరపున చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మండపాల వద్ద ఒక్కరిద్దరు ఉండే విధంగా చూడడంతోపాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. జైనూర్ ఘటన నేపథ్యంలో వాట్సాప్‌లో వచ్చే వాటిని నమ్మకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలు, గతంలో ఎదురైన ఇబ్బందులు, డీజేకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేందర్ రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, చాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమల్ కిశోర్ అగర్వాల్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, హిందూ సమాజ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు బొంపెల్లి హన్మండ్లు, సీఐలు సునీల్, కరుణాకర్‌రావు, ఫణిదర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నిర్మాణాలను తొలగించాలని ధర్నా

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 9 : నిర్మల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థి సంఘ నాయకులు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. కళాశాల ఆవరణలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలు తొలగించాలని రోడ్డుపై బైఠాయించారు. నిర్మాణాల ను అడ్డుకోకుంటే ఆందోళనను ఉధృ తం చేస్తామన్నా రు. కార్యక్రమం లో కళాశాల విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకు లు పాల్గొన్నారు.